బాబోయ్.. ఖాళీ స్థలాలు

- దోమలు, విషసర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- వ్యాధులు విజృంభిస్తాయనే భయంతో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వికాస్ స్కూల్ రోడ్డులో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారాయి. ఎళ్ల తరపడి ఈ స్థలాలను ఇలాగే వదిలేయడంతో మురుగు, వ్యర్థాలకు ఆవాసాలుగా మారాయి. ఆయా గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నప్పటికీ ఈ ఖాళీ స్థలాల సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌ల కల్చర్ పెరిగిపోవడంతో నగరానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామాల్లో స్థిరపడే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతూనే ఉంది. దీంతో నివాసాల మధ్య ఉన్న ఈ ఖాళీ స్థలాలతో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఖాళీ స్థలాల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగి మురుగునీరు నిల్వ ఉండి బురదమయంగా మారడంతో పలు సమస్యలకు తావిస్తోంది. నివాసాలకు అతి సమీపంలో ఉన్న ఈ స్థలాలు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయా గ్రామాల్లోని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లల్లోకి వస్తున్న విష సర్పాలు

ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు నివాసాలపై విజృంభిస్తున్నాయని ఫలితంగా అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో బురద పేరుకుపోవడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో రాత్రి సమయాల్లో నివాసాల మధ్యకు విష సర్పాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగుతో నిండిన ఖాళీ స్థలాల్లో పందులు కూడా స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

ప్రమాదకర ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి స్థలాలు శుభ్రపరిచి మెరక తోలించుకోవాల్సిందిగా అధికారులు కనీసం నోటీసులు కూడా జారీ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. స్థల యజమానులు మాత్రం తమ తమ స్థలాలను శుభ్రపరిచి మేరక తోలించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని ముందుకు రావడం లేదు. ఇప్పటికైన ఆయా గ్రామ పంచాయతీ అధికారులు ఈ సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రామవరప్పాడు హైస్కూల్ రోడ్డులో అల్లుకుపోయిన ముళ్లకంపలు



ప్రసాదంపాడు జమ్మిచెట్టు సెంటర్ వీధిలో ఖాళీ స్థలంలో మురుగు, ఏపుగా పెరిగిన జమ్ము

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో ఆశ్రమం రోడ్డు, శాస్త్రి బజారు, ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా, వివేకానంద స్కూల్ రోడ్డు, ఎనికేపాడులో కొడాలివారి వీధి, డీమార్ట్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. అయ్యప్పనగర్, యనమలకుదురు లాకుల రోడ్డు, చౌదరిపేట ఏరియా, పప్పులమిల్లు సెంటరుతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఉండదని పేర్కొన్నారు

వీధి బాలలకు విద్య అందాలి



కంకిపాడు: వీధి బాలలకు మెరుగైన విద్య అందాలని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని పునాదిపాడు చెరువు కట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న సంచార జాతులను కిషోర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. అక్కడి చిన్నారులకు అవసరమైన విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించాలని, క్రమశిక్షణతోనే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యా వలంటీరు సుసిత్రీ, సోషల్ వర్కర్ విజయ రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ టి. వెంకటకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీన నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షల్లో మెరిట్ అభ్యర్థులను అర్హత ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: పెళ్లి చేసుకోమని యువతి వెంట పడి వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. యనమలకుదురు ఇందిరానగర్-1కి చెందిన యువతి కుటుంబ సభ్యులతో ఉంటూ సూపర్ మార్కెట్‌లో పని చేస్తుంది. కాగా లక్ష్మణరావు అనే వ్యక్తి ఆమెను ప్రేమించాలని, పెళ్లి చేసుకుంటానని వెంటపడ సాగాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు అతడిని మందలించారు. కాగా గత రెండు రోజుల క్రితం లక్ష్మణరావు యువతి ఇంటికి వెళ్లి తనకు ఇచ్చి పెళ్లి చేయకపోతే అంతుచూస్తానని కుటుంబ సభ్యులను బెదిరించాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై కంకిపాడు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ శివారు గాయత్రీవిహార్ పరిధిలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో 29 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25,040 నగదు, రెండు పందెం కోళ్లు, 10 కోడి కత్తులు, 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారి సుందరీకరణ పనులు ప్రారంభం

గన్నవరం: నియోజకవర్గంలోని విమానాశ్రయం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు చేపట్టనున్న జాతీయ రహదారి సుందరీకరణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మండలంలోని కేసరపల్లిలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల వద్ద ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ నుంచి రామవరప్పాడు వరకు ఎన్‌హెచ్‌ను సుందరీకరించనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 45 వేల చదరపు మీటర్ల బ్యూటీఫికేషన్ పనులు జరగగా, ఇప్పుడు మరో 15 వేల చదరపు మీటర్ల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్ నుంచి చిన్న ఆవుటపల్లి వరకు మరో 25 వేల చదరపు మీటర్లు జాతీయ రహదారిని సుందరీకరించనున్నట్లు చెప్పారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్ రెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ప్రిన్సిపాల్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ సత్యనారాయణ, ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటశివయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి



పెనమలూరు: వలంటీర్లను తిరిగి విధుల్లో తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పోరంకిలో నిరసన ప్రదర్శన చేశారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీ నిలబెట్టుకొని వెంటనే న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు వలంటీర్లకు న్యాయం చేస్తానని, రూ. 10 వేలు గౌరవ వేతనం ఇస్తానని ప్రకటించారన్నారు. అయితే ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా వలంటీర్లకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 2 లక్షలకు పైగా వలంటీర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. అలాగే వలంటీర్లకు బకాయి ఉన్న వేతనం వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్‌వలి, వెంకటేశ్వరమ్మ, వలంటీర్ల సంఘం అధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి, పి. దుర్గాభవాని, కె.నాగరాజు, బి.శ్రీను పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

పెనమలూరు: ఈనెల 20వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీవెంకటేశ్వర యోగా సేవ కేంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పెనమలూరు సెంటర్‌లో కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఆదివారం ఉదయం 6.30 గంటలకు యోగా శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. యోగా శిక్షణ 28 రోజుల పాటు ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు శిక్షణలో పాల్గొనాలని శ్రీవెంకటేశ్వర యోగా కేంద్రం తెలిపింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం జ్యోత్స్న



ఎంపికైన ప్రొద్దుటూరు విద్యార్థులు

ఉయ్యూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఉయ్యూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఆర్. ప్రజ్వల్, అండర్-14 బాలుర విభాగంలో జి. జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు జీవి. రమణ, జీఆర్ఎం. లాల్‌లను హెచ్‌ఎం జ్యోత్స్న దేవి శుక్రవారం అభినందించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకూ సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆమె తెలిపారు.

కంకిపాడు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ క్రీడాకారులు ఎంపిక అయ్యారు. హెచ్‌ఎం అరుణకుమారి క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న విజయవాడలో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో కూకట్లపల్లి మైనశ్రీ, పాగోలు వాగ్దేవి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అండర్-14 కేటగిరీలో ఒ. జ్యోతి, పి.యోగశ్రీ అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వీరంకి రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ పి.నాగమణి పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు దుర్మార్గం

గన్నవరం: ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపొద్దని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు మోయలేని విద్యుత్ భారాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో సర్దుబాటు చార్జీల పేరుతో మళ్లీ రూ. 23 వేల కోట్లు ప్రజలపై భారం వేయడానికి ప్రభుత్వం సిద్ధమవడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తుండటం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ట్రూఅప్ చార్జీలను ఎత్తివేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బడుగు మరియదాసు, బెజవాడ తాతబ్బాయి, రాంబాబు, సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

24 నుంచి రీసర్వేపై గ్రామసభలు

కంకిపాడు: భూముల రీసర్వే ప్రక్రియపై ఈనెల 24వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి. భావన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న ఉప్పలూరు, 25న కొణతనపాడు, 26న వేల్పూరు, 28న తెన్నేరు, 29న ప్రొద్దుటూరు, 30న ఈడుపుగల్లు, నవంబరు 1న పునాదిపాడు, 2న దావులూరు, 4న కంకిపాడు, 5న నెప్పల్లి, 6న చలివేంద్రపాలెం గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. ప్రజలు సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా!



కానూరులో గుంతలమయంగా మారిన రహదారి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు మన గార్డెన్స్ సమీపంలో ఉన్న యడ్లపల్లి సత్యంగారి వీధిలో రహదారి దారుణంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే స్థానికులకు నరకం కనబడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాడిగడప మున్సిపాలిటీ అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ పరీక్షలు

పెనమలూరు: మండల పరిధిలో శుక్రవారం సాక్షి స్పెల్‌బీ పరీక్షలు పలు పాఠశాలల్లో ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు పరీక్షల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మండల పరిధిలోని కానూరు స్కాట్ స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 132 మంది, పోరంకి శ్రీ ఉషోదయ పాఠశాలలో 20 మంది, గంగూరు నలంద పాఠశాలలో 18 మంది, పోరంకి సంవేద విద్యాపీఠ్ లో 81 మంది విద్యార్థులు చొప్పున వివిధ క్యాటగిరీలలో పాల్గొని పరీక్ష విజయవంతంగా రాశారు. స్కాట్ స్పైన్ పాఠశాల ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి సాక్షి స్పెల్ బీ పరీక్ష ఎంతగానో ఉపయోపడుతుందన్నారు. విద్యార్థుల్లో ధైర్యం, ఏకాగ్రత, ఆలోచనా శక్తి పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

రామవరప్పాడు: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో స్పెల్ బీ పరీక్షలు ఉత్సాహంగా జరిగాయి. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ వ్యవహరించిన ఈ పరీక్షలకు మొత్తం 151 మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నవంబర్ 17న జిల్లా స్థాయిలో పరీక్షలు నిర్వహించనున్నారు.



స్కాట్స్ స్పైన్ స్కూల్‌లో సాక్షి స్పెల్ బీ పరీక్షలు రాస్తున్న చిన్నారులు

ఆంగ్లంపై పట్టు పెరుగుతుంది..



స్పెల్ బీ ద్వారా ఆంగ్ల భాషపై పట్టు పెరుగుతుంది. స్పెల్ బీలో పాల్గొన్న తర్వాత ఎంతో ఉత్సాహంగా ఉంది. స్పెల్ బీ పరీక్ష విద్యార్థుల నైపుణ్యానికి అవసరం.

– ఎ.సాన్వి, 8వ తరగతి, పోరంకి

మంచి అవకాశం



ప్రతిభను నిరూపించుకోవటానికి మంచి అవకాశం స్పెల్‌బీ పరీక్ష. ఇటువంటి పరీక్షలు రాయడం వలన విశ్వాసం పెరుగుతుంది. భాషపై పట్టు సాధించడానికి మంచి అవకాశం.

– పి.హర్షికచౌదరి, పోరంకి.

సంతోషంగా ఉంది



సాక్షి స్పెల్ బీ పరీక్షరాయడం చాలా బాగుంది. సబ్జెక్టు మెరుగుచేసుకునేందుకు పరీక్ష ఉపయోగపడుతుంది. స్పెల్ బీ పరీక్ష రాయడం సంతోషంగా ఉంది.

– లోహిత్, కానూరు

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కంకిపాడు: అభివృద్ధి పనులను సజావుగా పూర్తి చేయాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 12 లక్షలతో సిమెంటు రోడ్డు, రూ. 10 లక్షలతో చేపట్టనున్న హిందూ శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎంపీపీ రాజ్యలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ నిధులను సమర్థంగా వినియోగించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పాటుపడాలని, లోటుపాట్లు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఉపసర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ పి.అనూష, నేతలు లాం సురేష్, పడవల మధుసూదన్‌రావు, చలసాని రాధాకృష్ణ, పీఆర్ డీఈ కె. శ్రీనివాస్, ఏఈ రాఘవరావు, ఈఓ బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండలంలో ఉపాధి నిధులు రూ. 5.62 కోట్లతో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు ప్రాధాన్యతనిస్తూ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పల్లె పండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ నిర్మించబోయే పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మండల తహసీల్దార్ బి.సుగుణ మాట్లాడుతూ వరదల్లో ఇళ్లు మునిగి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందనివారు తమ బ్యాంకు ఖాతాలను సరిచేసుకోవాలని, ఇంకా రానివారికి సహాయం అందజేయడం జరుగుతుందని చెప్పారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంటు గ్యారంటీ ప్రోగ్రామ్‌లో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ శాఖ, మండల విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, మత్స్యశాఖ, ఐసీడీఎస్, గృహనిర్మాణం, పీఆర్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ఆయా శాఖల ద్వారా జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. కోఆప్షన్ సభ్యులు అల్తాఫ్, ఎంపీడీఓ బి. విగ్గిన్స్, ఈఓఆర్డీ ప్రసాద్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

జాతీయస్థాయి కరాటేలో

సత్తా చాటిన విద్యార్థులు



ఉయ్యూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు సత్తా చాటారు. చెన్నైలో ఇటీవల నిర్వహించిన మూడవ కరాటే ఆలిండియా ఛాంపియన్ షిప్‌లో ఎంకే ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 18 మంది పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. క్రీడాకారులను లయన్స్ జిల్లా డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎంకె. బాబు, డీన్ మణికుట్టన్, కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.